TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ సంపుటి : 1 సంచిక : 51 గురువారం, సెప్టెంబర్ 03, 2026, పేజీలు - 4 వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR VOLUME : 1 ISSUE: 51 03-09-2026 (THURSDAY) PAGES: 4 RS : 5/-

## టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్

# పోస్టుల భర్తీ




**హైదరాబాద్ :**తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

# రక్షణ ఎక్స్‌పోకు రండి

# అనుమతులు ఇప్పించండి :

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు రావాలని ఆహ్వానం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు సేకరించి ఇస్తామన్న సీఎం



**హైదరాబాద్ :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్?లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని, కావాల్సిన అనుమతులనూ మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి ఇస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ జరుగుతోందన్న సీఎం, మరో 750 ఎకరాలు సేకరించి ఇస్తామని కేంద్రమంత్రికి చెప్పారు.రక్షణ ఎక్స్‌పోకు రండి : భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్? కేంద్రమంత్రికి తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌షో, పారిశ్రామిక, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఎక్స్‌పోలో పాల్గొంటారని, ఇలాంటి సదస్సుకు రక్షణమంత్రి హాజరై వారికి మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.

# రాజీనామా కోరలేదు

## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు.బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## 22ఎ భూములపై అసెంబ్లీలో

# ఏం మాట్లాడతారో రండి



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :** 22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు.(బుధవారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చా ట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నా మని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జరాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాంఅయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శిస్తావా కేటీఆర్..?. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండండి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం.

## ఉత్తరాంధ్రను ముద్దాడిన

# గోదారమ్మ



**అనకాపల్లి జిల్లా :**
ఉత్తరాంధ్ర దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయి. ఈ చారిత్రక ఘట్టానికి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలకు జలహారతి ఇచ్చి, పవిత్ర జలాలను శిరస్సున చల్లుకున్నారు. అనంతరం నేలపై సాష్టాంగ ప్రమాణం ఆచరించి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరిన క్షణాన తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఓ దశలో కాలువ నుంచి నీరు ప్రవహిస్తుంటే, చంద్రబాబు మెడలోని పచ్చ కండువా తీసి గాల్లో గిరగిరా తిప్పి తన ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబును చూసి మిగతా నేతలు, రైతులు కూడా తమ కండువాలను గాల్లో ఊపుతూ హర్షం వెలిబుచ్చారు అంతకుముందు, పాయకరావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెగ్యులేటర్ బటన్ నొక్కి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలోకి గోదావరి నీటిని విడుదల చేశారు. దాంతో కాలువలోకి ప్రవేశించిన గోదావరికి చంద్రబాబు జలహారతి పట్టారు. అనంతరం చంద్రబాబు, మరికొందరు రైతులు కూడా రెగ్యులేటర్ ఆన్ చేశారు.

## మంత్రివర్గంలో మార్పులా? సమూల ప్రక్షాళనా! -

# ఉత్కంఠగా కాంగ్రెస్ రాజకీయం

**హైదరాబాద్ ::** తెలంగాణ మంత్రివర్గంలో జరగనున్న మార్పులపై కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ నాయకులంతా ఢిల్లీకి వెళుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నేడు ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రులను కలవడానికని, జలశక్తి మంత్రిత్వశాఖ నిర్వహించే సమావేశానికని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి అవార్డు ప్రదానోత్సవానికని ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణం చెబుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా వారందరి ఢిల్లీ పర్యటన తీవ్ర ఆసక్తికరంగా మారింది. విదేశీ పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ జనరల్? సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీ చేరుకున్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నిన్న సాయంత్రమే కేసీతో సమావేశమై ఇటీవల పరిణామాల గురించి సుదీర్ఘంగా చర్చలు చేశారు. సురేఖ వ్యవహారంతోపాటు ఒకరిద్దరు మంత్రుల వ్యవహారశైలి గురించి, మంత్రివర్గంలోకి తీసుకోవాల్సిన వారి గురించి మాట్లాడినట్లు సమాచారం. భట్టి, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కూడా కేసీ చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం నేడు జరగవచ్చని తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనల వంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు లైన్? దాటిన వారిపై చర్యలు అవసరమనే అభిప్రాయంతో మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్య అనివార్యమనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది.



## సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకం

**అయోధ్య:** అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులయ్యారు. సీఈఓ ఎంపిక కోసం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలో ఏర్పాటైన ముగ్గురు సభ్యుల కమిటీ జితేంద్ర మిశ్రాను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో సమావేశమైన రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జితేంద్ర మిశ్రా నియామకానికి ఆమోదం తెలిపింది. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం, రోజువారీ ఆలయ నిర్వహణ సిబ్బందిని సమన్వయం చేయడం వంటి విధులను ఆయన నిర్వర్తించనున్నారు. జితేంద్ర మిశ్రా గతంలో భారతీయ వాయుసేనలో సీనియర్ అధికారిగా, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా విశేష సేవలందించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం

# సాధించిన ప్రగతి ఇదే



**హైదరాబాద్ :**కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు.గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# వినాయక చవితి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

**– డీజే నిర్వాహకులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసిన వికారాబాద్ పట్టణ సీఐ రఘు కుమార్**

**– నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం**



**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని వికారాబాద్ పట్టణ సీఐ రఘు కుమార్ డీజే నిర్వాహకులకు సూచించారు. పండుగ సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి, శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన హెచ్చరించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద భారీగా ప్రజలు, భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ సూచించారు. ముఖ్యంగా డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. శబ్ద కాలుష్యం కారణంగా చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులకు గురికాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఉత్సవాల సందర్భంగా యువత అత్యుత్సాహానికి లోనై ఘర్షణలకు పాల్పడకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించకుండా, అందరూ కలిసి సోదరభావంతో పండుగను జరుపుకోవాలని కోరారు. వినాయక విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సమయంలో పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ రఘు కుమార్ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లను పూర్తిగా దిగ్బంధించడం, అనుమతి లేని ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. "పండుగ ఆనందంగా జరుపుకోవాలి.. ఘర్షణలకు తావివ్వకూడదు" అని సీఐ పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నిబంధనలను ఉల్లంఘించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

# జవహర్‌నగర్‌లో కబ్జా దందా.. అధికారుల ఆదేశాలకూ విలువ లేదా?

**– బస్టాండ్, వినాయక మండప స్థలాలపై అక్రమ నిర్మాణాలు కబ్జాదారులపై చర్యలు ఎప్పుడు?**



**అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్:** అంబేద్కర్‌నగర్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారులు కన్నేశారు. ఆర్టీసీ బస్టాండ్, వినాయక మండపం కోసం వదిలిన స్థలాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
స్థలాలను కాపాడాల్సిన అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. కబ్జాల పరంపర మాత్రం ఆగకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ నిర్మాణాలు కొనసాగుతుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజా స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంటనే ఉమ్మడి సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.కబ్జాలను అడ్డుకోకపోతే.. మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ భగ్గు!

**– నేరేడ్‌మెట్‌లో భారీ ధర్నా.. తప్పుడు కేసులు పెట్టొద్దని సీపీకి ఎమ్మెల్యే విజ్ఞప్తి**





**అదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భారీగా తరలివచ్చారు.ఎన్నికల హామీలు, గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.అనంతరం మల్కాజ్‌గిరి సీపీ సుమతి ఐపీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ కక్షతో తప్పుడు కేసులు నమోదు చేయకుండా పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఇప్పటికే నమోదైన కేసులను వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

# జవహర్‌నగర్‌లో పొలిటికల్ హీట్.. బీఆర్ఎస్ ధర్నాతో ఉద్రిక్తత!

**– '1000 రోజుల పాలన.. దగా పాలన' అంటూ కేటీఆర్ శ్రేణుల నినాదాలు**

**– 'ధర్నా సిగ్గుచేటు' అంటూ కాంగ్రెస్ నేతల ఫైర్.. ఇరువర్గాల మధ్య తోపులాట**



**అదాబ్ సైబరాబాద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన ధర్నాతో జవహర్‌నగర్‌లో రాజకీయ వేడి రాజుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బాలాజీనగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ఆందోళన చేపట్టాయి. 'ప్రజా పాలన కాదు.. దగా పాలన' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.బీఆర్ఎస్ మాజీ మేయర్ మేకల కావ్య, అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు జిట్టా శ్రీ వాణి, శ్రీనివాస్‌రెడ్డి, పల్లపు రవి, ఆలూరు రాజశేఖర్, నాయకులు సింగన బాల్రాజ్, అహ్మద్ పాషా తదితరులు ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

**– 'ధర్నా సిగ్గుచేటు'.. కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

బీఆర్ఎస్ ధర్నాపై కాంగ్రెస్ నాయకులు శాంతి కోటేష్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ తీవ్రంగా స్పందించారు. బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాను సిగ్గుచేటైన రాజకీయ కార్యక్రమంగా అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కారం పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సరికాదని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమన్నారు.

**– వైఎస్సార్ వర్ధంతి వద్ద ఉద్రిక్తత**

బీఆర్ఎస్ ధర్నాకు సమీపంలోనే కాంగ్రెస్ నాయకులు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇరువర్గాల మధ్య ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. నినాదాలు, వాగ్వాదం అనంతరం కాంగ్రెస్--బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది.
సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తంగా మారిన ప్రాంతంలో పరిస్థితి సద్దుమణిగింది.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

## మూడో రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



**అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్ :** జర్నలిస్టులపై దాడులను అరికట్టి, వారి రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని జర్నలిస్ట్ మహంకాళి బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లాలో దళిత జర్నలిస్ట్ పుల్ల రవీందర్‌పై జరిగిన దాడిని ఖండించారు.
జవహర్‌నగర్ బాలాజీనగర్‌లో తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం మూడో రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు అశోక్ మాదిగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూడిద నరేందర్, అంబాల విష్ణు, అంబాల మల్లేష్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

**– చేవెళ్లలో వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు**



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు షాబాద్ చౌరస్తాలోని వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ...వైఎస్ఆర్ ఉమ్మడి రాష్ట్ర ప్రజా సంక్షేమానికి చేసిన సేవలు అంతా ఇంత కాదని, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకుడు ఈ లోకంలో లేకపోయినా అతడు చేసిన సేవలు చెరిగిపోని విధంగా ఉన్నాయని, రాష్ట్రంలో ఎవరికి దక్కని గౌరవం ఒక రాజశేఖర్ రెడ్డి కి దక్కిందని, ఎన్నో సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో... వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, ముడిమేల సొసైటీ చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి, 14 వార్డు కౌన్సిలర్స్ మద్దెల శ్రీనివాస్, మండల అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, సీనియర్ నాయకులు సున్నపు వసంతం, సర్పంచ్ బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాధవి రామ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు పడాల ప్రభాకర్, జాంగిర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

**–అధ్యక్షుడిగా శ్రీకాంత్.. గౌరవ అధ్యక్షుడిగా నయూమ్‌ఖాన్**



**ఆదాబ్ సైబరాబాద్, చేవెళ్ల :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఫోరం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపకురాలు నాగవెల్లి జ్యోతి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి గ్యార సురేష్, జిల్లా కోఇన్‌చార్జి దన్నె మల్లేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా ఆలూరు గ్రామం మొదటి వార్డు సభ్యుడు చెనిగేలా శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా ఎండీ నయూమ్‌ఖాన్ ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పల్లని మహేందర్, విజయ్‌కుమార్, కృష్ణమాచారి, అధికార ప్రతినిధిగా జిన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శులుగా రాకేష్, మహేందర్, మండల కార్యదర్శులుగా మల్లేష్, రవీందర్, సహాయ కార్యదర్శిగా టి. మల్లేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రమాదేవి, రామకృష్ణలను ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా జిల్లా నాయకులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి ఫోరం ద్వారా ఐక్యంగా పనిచేయాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వార్డు సభ్యులకు ప్రభుత్వం నెలకు రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యులకు భద్రతా కార్డులు మంజూరు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు వార్డు సభ్యులు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వార్డు సభ్యుల హక్కులు, సంక్షేమం కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.

## పేదల చెంతకు వైద్యం.. ఉచిత శిబిరానికి విశేష స్పందన

## వంద మందికి ఉచిత రక్త పరీక్షలు.. వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు




**ఆదాబ్ సైబరాబాద్, ఆల్విన్ కాలనీ :** పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండలో బుధవారం ఈ శిబిరాన్ని నిర్వహించారు.
శ్రీవైష్ణవి డయాగ్నోస్టిక్స్ అధినేత సందీప్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవైష్ణవి డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో, పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం, కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద నిర్వహించిన శిబిరంలో సుమారు 100 మందికి వివిధ రకాల రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పేదలు అధికంగా నివసించే ఎల్లమ్మబండ ప్రాంతంలో ఉచిత వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవి, శ్రీవైష్ణవి డయాగ్నోస్టిక్స్ అధినేత సందీప్‌కుమార్, కేర్ అండ్ క్యూర్ వైద్యుడు డాక్టర్ అనిల్, సంఘం వ్యవస్థాపక సభ్యులు గోపాస్ చంద్రశేఖర్, లోకేశ్, సంతోష్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు చక్కెర వద్దు.. ఆరోగ్యమే ముద్దు!

**– పిల్లలకు ఆరోగ్యకర ఆహారపు అలవాట్లను నేర్పించాలి**

**– ఐసీఎంఆర్--ఎన్ఐఎన్ డైరెక్టర్ డా.భారతి కులకర్ణి**




**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నేర్పించాలని ఐసీఎంఆర్--నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డా. భారతి కులకర్ణి సూచించారు. రెండేళ్లలోపు చిన్నారులకు అదనపు చక్కెర ఇవ్వకూడదని చెప్పారు. పోషకాహార లోపంతోపాటు అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.పీఐబీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రెస్ టూర్‌లో భాగంగా ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది పాత్రికేయుల బృందం బుధవారం ఐసీఎంఆర్--ఎన్ఐఎన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న పోషకాహార పరిశోధనలు, ప్రజారోగ్య కార్యక్రమాల గురించి అధికారులు వారికి వివరించారు.ఆహార పదార్థాల్లోని పోషక విలువలు, శరీరానికి అవసరమైన పోషకాలపై ఐసీఎంఆర్--ఎన్ఐఎన్ శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహిస్తోందని డా. భారతి కులకర్ణి తెలిపారు. దేశీయ ఆహార పదార్థాల్లోని శక్తి, ప్రొటీన్, సూక్ష్మ పోషకాలు, ఖనిజాల వివరాలను ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఇవి పరిశోధకులు, ఆహార పరిశ్రమ, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఉపయోగపడుతున్నాయని వివరించారు.వయసు, శారీరక పరిస్థితులకు అనుగుణంగా భారతీయులకు అవసరమైన పోషకాలు, రోజువారీ తీసుకోవాల్సిన పరిమాణాలపై సిఫార్సులను ఐసీఎంఆర్ రూపొందిస్తోందన్నారు. వీటి ఆధారంగానే పలు పోషకాహార కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు.

**– అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు ఉన్న ఆహారంతో ముప్పు**

పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం పెరగడానికి శారీరక శ్రమ తగ్గడం, కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ప్రధాన కారణాలని డా. భారతి కులకర్ణి తెలిపారు. కేవలం ఆహారం అందుబాటులో ఉండటం మాత్రమే ఆహార భద్రత కాదని, శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు అందేలా వైవిధ్యమైన ఆహారం తీసుకోవడం కూడా ముఖ్యమని చెప్పారు.





ఉత్తరాఖండ్‌లో పండే మండువా, జంగోరా, చోలై, కోడా వంటి స్థానిక పంటలు, చిరుధాన్యాల పోషక విలువలపై పరిశోధనలు చేస్తున్నామని తెలిపారు. రాగి తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందా అనే అంశంపైనా అధ్యయనాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

**– మీడియా బాధ్యత కీలకం**

ఐసీఎంఆర్--ఎన్ఐఎన్ న్యూట్రిషన్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డా. సుబ్బారావు ఎం. గవరవరపు మీడియా ప్రతినిధులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపం, సూక్ష్మ పోషకాల లోపాలతోపాటు జీవనశైలి కారణంగా అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు ఏకకాలంలో పెరుగుతున్నాయని వివరించారు. ఆహారంపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం పాత్రికేయులు ఐసీఎంఆర్--ఎన్ఐఎన్‌లోని ఆధునిక ప్రయోగశాలలను సందర్శించారు. ఆహార విశ్లేషణ, లిపిడ్ కెమిస్ట్రీ తదితర అంశాలపై జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. అనంతరం సాలార్‌జంగ్ మ్యూజియాన్ని సందర్శించి హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక విశేషాలను తెలుసుకున్నారు.

# ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా వైద్యాధికారి విస్తృత తనిఖీలు

- గర్భిణీలకు నిర్దేశిత టీకాలు సకాలంలో అందాలి.
- అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలి.
- ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను మరింత మెరుగుపరచాలి.
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి





**వరంగల్ జిల్లా ,**
వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి గారు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ధర్మారం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గీసుకొండలను మరియు చింతల్ సబ్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంగెం లను సందర్శించి, అక్కడ అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. మొదట ఎ ఎ ఎం ధర్మారంను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ సెషన్‌ను పరిశీలించారు. వ్యాక్సినేషన్ రికార్డులను తనిఖీ చేసి, చిన్నారులు మరియు గర్భిణీలకు నిర్దేశిత టీకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సబ్ సెంటర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సాధించ వలసిన అంచనా స్థాయి ప్రకారం అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. తదుపరి పి ఎచ్ సి గీసుకొండను సందర్శించి రికార్డులను పరిశీలించారు. హెడ్‌క్వార్టర్స్ సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అనంతరం చింతల్ సబ్ సెంటర్ ను సందర్శించి ఇమ్యూనైజేషన్ సెషన్‌ను పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ, రికార్డుల నిర్వహణను పరిశీలించి, అర్హులైన ప్రతి చిన్నారికి, గర్భిణీకి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంగెం ను సందర్శించి, మాతా–శిశు ఆరోగ్య సేవలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని,

# ౯౯ శాతం మంది పీలుస్తున్నది
## కాలుష్యపు గాలినే అధ్యయనంలో వెల్లడి



వాయు కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా గాలిలోని అత్యంత సూక్ష్మమైన కాలుష్య కణాలు శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపడంతో పాటు క్యాన్సర్ ముప్పును కూడా పెంచుతున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాలను మించిన కాలుష్యానికి గురవుతున్నట్లు పరిశోధకులు తెలిపారు. 2000 నుంచి 2020 మధ్య కాలంలో ప్రపంచంలోని 952 ప్రాంతాల్లో నమోదైన క్యాన్సర్ భారాన్ని, సాధారణ వాయు కాలుష్య కారకాలకు దీర్ఘకాలికంగా గురికావడంతో ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేశారు. మొత్తం 10.9 కోట్ల క్యాన్సర్ కేసులను పరిశీలి ంచిన ఈ పరిశోధనలో పీఎం2.5 ప్రధాన పాత్ర పోషిస్తున్న కాలుష్య కారకంగా గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాలు నేచర్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

**పెరిగిన క్యాన్సర్ ముప్పు..**
2.5 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సూక్ష్మ కణాలను పీఎం2.5గా పిలుస్తారు. ఇవి చాలా చిన్నగా ఉండటంతో శ్వాస ద్వారా శరీరంలోకి సులభంగా ప్రవేశిస్తాయి. అధ్యయనం ప్రకారం 2000–2020 మధ్య నమోదైన మొత్తం క్యాన్సర్ కేసుల్లో సుమారు 88.2 లక్షల కేసులకు పీఎం2.5 కాలుష్యం కారణమై ఉంటుందని అంచనా వేశారు. ప్రతి క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం2.5 స్థాయి 10 మైక్రోగ్రాములు పెరిగినప్పుడు క్యాన్సర్ వచ్చే ప్రమాదం 17.9 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. అదే స్థాయిలో పీఎం2.5కు గురికావడం వల్ల కిడ్నీ క్యాన్సర్ ప్రమాదం 17.9 శాతం, మూత్రాశయ క్యాన్సర్ ప్రమాదం 21.1 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది. పీఎం2.5 ప్రభావం కేవలం శ్వాసకోశ వ్యవస్థకే పరిమితం కాదని పరిశోధకులు తెలిపారు. థైరాయిడ్, అన్నవాహిక, పెద్దపేగు, మలద్వారం, రొమ్ము వంటి ఇతర భాగాలకు సంబంధించిన క్యాన్సర్లతోనూ ఈ కాలుష్యానికి సంబంధం ఉన్నట్లు అధ్యయనం సూచించింది.

**నివారణే ముఖ్యం..**
పీఎం2.5 కాలుష్యం తొలగించగలిగితే లేదా దానికి గురికావడాన్ని గణనీయంగా తగ్గించగలిగితే శ్వాసనాళం, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల్లో సుమారు 17.9 శాతం వరకు నివారించవచ్చని అధ్యయనం అంచనా వేసింది. ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పీఎం2.5 ఒక ప్రధాన కారణమనే విషయాన్ని ఈ ఫలితాలు మరింత బలపరుస్తున్నాయి. అదేవిధంగా, ఇతర వాయు కాలుష్య కారకాల ప్రభావాన్ని కూడా పరిశోధకులు పరిశీలించారు. ప్రతి క్యూబిక్ మీటర్‌కు 10 మైక్రోగ్రాముల చొప్పున పీఎం2.5, ఓజోన్, నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయిలు పెరిగినప్పుడు క్యాన్సర్ ప్రమాదం వరుసగా 16 శాతం, 4.23 శాతం, 11.7 శాతం పెరిగినట్లు గుర్తించారు. 2000 నుంచి 2020 మధ్య నైట్రోజన్ డయాక్సైడ్ కాలుష్యానికి సంబంధించి సుమారు 66.7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం అంచనా వేసింది. ఓజోన్ కాలుష్యానికి సంబంధించి సుమారు 26 లక్షల కేసులు ఉన్నట్లు వెల్లడించింది. ఎక్కువ రకాల క్యాన్సర్ల విషయంలో పురుషులతో పోలిస్తే మహిళలు ఈ కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

**తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లోనే అధికం..**
ప్రపంచవ్యాప్తంగా తక్కువ, మధ్యస్థ ఆదాయ దేశాల్లో వాయు కాలుష్యానికి గురికావడం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం పేర్కొంది. ప్రపంచ జనాభాలో దాదాపు 99 శాతం మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన గాలి నాణ్యత మార్గదర్శకాలను మించిన కాలుష్య స్థాయిలను పీలుస్తున్నారని పరిశోధకులు తెలిపారు. పీఎం2.5 కణాలు చాలా చిన్న పరిమాణంలో ఉండటం వల్ల శరీరంలోకి లోతుగా ప్రవేశించి అనేక జీవక్రియలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు వివరించారు. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ పెరగడం, డీఎన్ఏ దెబ్బతినడం, రోగనిరోధక వ్యవస్థ పనితీరులో మార్పులు వంటి ప్రక్రియల ద్వారా ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని తెలిపారు. వాయు కాలుష్యం శరీరంలోని దాదాపు ప్రతి అవయవ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అధ్యయనం పేర్కొంది. వివిధ ఆదాయ స్థాయిలకు చెందిన దేశాలు, ప్రాంతాల నుంచి సేకరించిన క్యాన్సర్ డేటాను ఈ పరిశోధనలో ఉపయోగించడంతో ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా వర్తింపజేయడానికి అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు

# 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు

**– రామప్ప నీడలో మరో శిల్ప అద్భుతానికి జాతీయ గౌరవం**



**ఆదాబ్ సైబరాబాద్, ములుగు:** రాళ్లకు ప్రాణం పోసిన కాకతీయుల కళా వైభవానికి మరోసారి గౌరవం దక్కింది. తరతరాలుగా పాలంపేట నేలపై చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన 'గొల్లల గుడి' ఇప్పుడు జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు పొందింది. శతాబ్దాల నాటి ఈ ఆలయానికి కేంద్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపు ఇవ్వడంతో స్థానికుల్లోనూ, చరిత్ర––పురావస్తు ప్రేమికుల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. పాలంపేట అంటే ప్రపంచానికి ముందుగా గుర్తుకొచ్చేది రామప్ప ఆలయం. అయితే అదే ప్రాంతంలో, రామప్పకు నైరుతి దిశలో నిశ్శబ్దంగా నిలిచిన 'గొల్లల గుడి' కూడా కాకతీయుల అద్భుత నిర్మాణ ప్రతిభకు ప్రతీకగా నిలిచింది. కాలం మారినా, పాలకులు మారినా.. ఈ ఆలయ గోడలపై చెక్కిన శిల్పాలు మాత్రం నాటి కళాకారుల ప్రతిభను నేటి తరానికి పరిచయం చేస్తూనే ఉన్నాయి.

**– రాళ్లలో కనిపించే కళాకారుల ఊపిరి**
తూర్పు ముఖంగా ఉన్న మండపం, దాని చుట్టూ మూడు గర్భాలయాలతో కూడిన త్రికూటాలయ నిర్మాణం ఈ ఆలయ ప్రత్యేకత. ఆలయ ప్రహరీ, పైకప్పు అంచులు, ద్వారబంధాలపై కనిపించే సున్నితమైన శిల్పాలు చూపరులను ఆకట్టుకుంటాయి. హంసల వరుసలు, రంధ్రాల వల పనితనం వంటి సూక్ష్మ శిల్పాలు ఆనాటి శిల్పకారుల అసాధారణ నైపుణ్యాన్ని కళ్లముందు నిలుపుతాయి. ఆలయ గోడలపై ఉన్న శిల్పాల్లో విష్ణుమూర్తి, లక్ష్మి, గణేశుడు, మహిషాసురమర్దిని వంటి దేవతా రూపాలు దర్శనమిస్తాయి. జంతువుల ఆకృతులు, పుష్పాలంకరణలతో కూడిన ఎత్తైన వేదికపై ఆలయాన్ని నిర్మించారు. ప్రధాన ఆలయం ముందు ఉన్న రెండు ఉప ఆలయాల్లోని ద్వారపాలకుల శిల్పాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

**– తరాలకు అందాల్సిన వారసత్వం**
ఇవి కేవలం రాళ్లతో నిర్మించిన ఆలయాలు కాదు.. మన పూర్వీకుల ఆలోచనా విధానం, నిర్మాణ నైపుణ్యం, కళాత్మక దృష్టి, జీవన సంస్కృతికి నిలువెత్తు సాక్ష్యాలు. ఒకప్పుడు శిల్పకారులు తమ చేతులతో చెక్కిన ప్రతి ఆకృతి, ప్రతి గీత నేడు చరిత్ర పాఠంగా మారింది. 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు రావడం వల్ల ఈ చారిత్రక సంపద పరిరక్షణకు మరింత ప్రాధాన్యం లభించనుంది. రామప్పను చూసేందుకు వచ్చే పర్యాటకులు, చరిత్ర పరిశోధకులు, కళాభిమానులకు పాలంపేటలోని మరో అద్భుతాన్ని పరిచయం చేసే అవకాశం పెరగనుంది. శతాబ్దాలుగా పాలంపేట నేలపై మౌనంగా నిలిచిన 'గొల్లల గుడి' కథ ఇప్పుడు జాతీయ స్థాయికి చేరింది. రాళ్లలో దాగిన కాకతీయుల కళా వైభవానికి దక్కిన ఈ గుర్తింపు.. మన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యతను కూడా గుర్తుచేస్తోంది.

# జేఎన్‌టీయూ హైటెక్ సిటీ మార్గంలో ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారాలపై సమీక్ష

- యూటర్న్‌ల మూసివేత.. ఆర్టీసీ బస్సుల దారి మళ్లింపు పరిశీలన
- జేఎన్‌టీయూ జంక్షన్‌లో పాదచారుల అండర్‌పాస్ ప్రతిపాదన
- డ్రోన్ ఫుటేజీతో విప్రో జంక్షన్ ట్రాఫిక్ సమస్యలపై అధ్యయనం



**ఆదాబ్ సైబరాబాద్, సైబరాబాద్ :** జేఎన్‌టీయూ––హైటెక్ సిటీ, విప్రో జంక్షన్, బొటానికల్ గార్డెన్––ఏఎంబీ మాల్ మార్గాల్లో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహనాల నెమ్మదైన రాకపోకలకు శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సైబరాబాద్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ (రాజూజ) సీఈఓ నవీద్, అదనపు డీసీపీ ట్రాఫిక్–1, మాదాపూర్ ఏసీపీ ట్రాఫిక్, ట్రాఫిక్ అడ్వైజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**– రద్దీకి కారణాలపై దృష్టి**
జేఎన్‌టీయూ నుంచి హైటెక్ సిటీ వరకు, విప్రో జంక్షన్, బొటానికల్ గార్డెన్ నుంచి కోతగూడ ఫ్లైఓవర్, ఏఎంబీ మాల్ వరకు ఉన్న ప్రధాన కారిడార్లలో ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న ప్రాంతాలను అధికారులు సమీక్షించారు. వాహనాల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ప్రస్తుతం ఉన్న రహదారి కనెక్షన్లు, యూటర్న్‌లు, ప్రవేశ మార్గాలను శాస్త్రీయంగా పరిశీలించాలని నిర్ణయించారు.

**– యూటర్న్‌లు, రహదారి ఓపెనింగ్‌లపై మార్పులు**
అవసరమైన ప్రాంతాల్లో ఎంపిక చేసిన యూటర్న్‌లను మూసివేయడం, వాహనాల ప్రవేశ––నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించడం, అనవసరమైన రహదారి ఓపెనింగ్‌లను నియంత్రించడం వంటి ప్రతిపాదనలపై చర్చించారు. అలాగే రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ఆర్టీసీ బస్సుల రూట్లను అవసరానికి అనుగుణంగా దారి మళ్లించే అవకాశాలను కూడా పరిశీలించారు.

**– జేఎన్‌టీయూ జంక్షన్‌లో పాదచారుల అండర్‌పాస్**
జేఎన్‌టీయూ జంక్షన్ వద్ద పాదచారులు రోడ్డు దాటే సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా పాదచారుల అండర్‌పాస్ నిర్మాణ ప్రతిపాదనపై అధికారులు చర్చించారు. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలను సాంకేతికంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

**– డ్రోన్ ఫుటేజీతో విప్రో జంక్షన్ అధ్యయనం**
విప్రో జంక్షన్‌లో ట్రాఫిక్ ప్రవాహం, వాహనాలు నిలిచిపోయే ప్రాంతాలు, రద్దీకి దారితీస్తున్న బాటిల్‌నెక్స్‌ను డ్రోన్ ఫుటేజీ ఆధారంగా అధికారులు విశ్లేషించారు. వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి అనుగుణంగా ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని నిర్ణయించారు.

అదేవిధంగా బొటానికల్ గార్డెన్––కోతగూడ ఫ్లైఓవర్––ఏఎంబీ మాల్ కారిడార్‌లో ట్రాఫిక్ వేగాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలపై కూడా చర్చించారు. ట్రాఫిక్ సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలతో పాటు దీర్ఘకాలికంగా ఉపయోగపడే చర్యలను గుర్తించేందుకు మరిన్ని క్షేత్రస్థాయి అధ్యయనాలు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ జోక్యాలతో పాటు రహదారి నిర్వహణలో అవసరమైన మార్పులు చేపట్టి వాహనాల రాకపోకలు సాఫీగా, సురక్షితంగా, అంతరాయం లేకుండా సాగేలా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

# నిద్రలేమి సమస్యకు మెగ్నీషియం లేదా
## మెలటోనిన్ ఏది చక్కగా పనిచేస్తుంది

నిద్ర సరిగా లేకపోవడం రోజువారీ జీవనశైలిపై మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నవారు మెగ్నీషియం, మెలటోనిన్ వంటి సప్లిమెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రెండూ ఒకే విధంగా పనిచేయవు. నిద్ర సమస్యకు కారణం శరీరంలో ఉన్న లోపాలు, నిద్ర సమయం వంటి అంశాలను బట్టి వీటి ప్రయోజనం మారుతుంది. శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజాల్లో మెగ్నీషియం ఒకటి. ఇది 300కు పైగా జీవరసాయన ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా నాడీ వ్యవస్థ పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, నిద్ర, విశ్రాంతికి సహాయపడే గాబా ( అనే న్యూరోట్రాన్స్‌మిటర్ నియంత్రణలోనూ భాగస్వామ్యం వహిస్తుంది.

**మెగ్నీషియం తగ్గితే..**
శరీరంలో మెగ్నీషియం స్థాయిలు తక్కువగా ఉన్నవారికి దీని సప్లిమెంటేషన్ కొంత ప్రయోజనం కలిగిస్తుంది. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ నిద్ర సమస్యలు ఎదుర్కొనే వృద్ధులు, ఒత్తిడి కారణంగా నిద్ర సరిగా పట్టని వారు మెగ్నీషియం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇది కండరాల ఒత్తిడిని, శరీరంలోని టెన్షన్‌ను తగ్గించి విశ్రాంతికి సహాయపడుతుంది. మరోవైపు, మెలటోనిన్ అనేది మెదడు సహజంగా ఉత్పత్తి చేసే హార్మోన్. సాధారణంగా నిద్రపోయే సమయం దగ్గరపడినప్పుడు దీని ఉత్పత్తి పెరుగుతుంది. శరీరంలోని అంతర్గత జీవ గడియారాన్ని నియంత్రించడంలో మెలటోనిన్ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి నిద్ర సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్రలోకి వెళ్లేందుకు సహాయపడుతుంది. జెట్ లాగ్ కారణంగా నిద్ర సమయం మారిపోయినవారికి మెలటోనిన్ ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అలాగే షిఫ్ట్ ఉద్యోగులు, నిద్ర సమయం ఆలస్యంగా మారిపోయినవారు, శరీరంలోని సహజ నిద్ర–మెళకువ చక్రంలో మార్పులు వచ్చినవారికి కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

**పనితీరు భిన్నం..**
మెగ్నీషియం, మెలటోనిన్ రెండూ నిద్రకు సహాయపడినా వాటి పనితీరు భిన్నంగా ఉంటుంది. మెగ్నీషియం ప్రధానంగా శరీరం, కండరాలు విశ్రాంతి పొందేందుకు, నాడీ వ్యవస్థలోని కొన్ని ప్రక్రియలను నియంత్రించేందుకు సహాయపడుతుంది. మెలటోనిన్ మాత్రం శరీరానికి నిద్రపోయే సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్ర చక్రాన్ని సరిచేయడంలో సహాయ పడుతుంది. నిద్రపట్టకపోవడానికి ప్రధాన కారణం శరీరం లేదా మనసు రిలాక్స్ కాకపోవడం అయితే మెగ్నీషియం కొంత ఉపయోగపడుతుంది. నిద్ర సమయం పూర్తిగా మారిపోవడం, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వంటి సమస్యలు ఉంటే మెలటోనిన్ మరింత అనుకూలంగా ఉండే అవకాశం ఉంటుంది. మెలటోనిన్ సాధారణంగా మెగ్నీషియంతో పోలిస్తే వేగంగా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మెగ్నీషియం, మెలటోనిన్ రెండింటినీ కలిపి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వైద్య నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. సొంతంగా అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అవాంఛిత దుష్ప్రభావాలు కలిగిస్తుంది. మెగ్నీషియంను అధిక మోతాదులో తీసుకుంటే విరేచనాలు, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. కొన్ని మందులతో ఇది పరస్పర చర్యలకు కూడా కారణం అవుతుంది. మెలటోనిన్‌ను అధికంగా లేదా వైద్యుల సూచన లేకుండా తీసుకుంటే పగటిపూట మగత, తల తిరగడం, తలనొప్పి, ఎక్కువగా లేదా స్పష్టంగా కలలు రావడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తాయి.

# నకిలీ వైద్యులున్నారు జాగ్రత్త.!

- సైబరాబాద్‌లో ఫేక్ డాక్టర్లపై పోలీసుల కొరడా
- నకిలీ క్లినిక్‌లపై ఏకకాలంలో దాడులు 10 మంది అరెస్ట్
- అర్హతలు లేకుండానే వైద్యం
- పిల్లలకు సైతం చికిత్స
- ఐవీ ఫ్లూయిడ్స్, సెలైన్ ఎక్కిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం




**ఆదాబ్ సైబరాబాద్, సైబరాబాద్:** ఎలాంటి వైద్య అర్హతలు, చెల్లుబాటు అయ్యే వైద్య ధ్రువపత్రాలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజలకు చికిత్స అందిస్తున్న నకిలీ వైద్యులపై సైబరాబాద్ పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా కొరడా ఝుళిపించారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా సైబరాబాద్ ఎస్ఓటీ కుత్బుల్లాపూర్, ఆర్‌సీ పురం జోనల్ బృందాలు, సంబంధిత పోలీస్ స్టేషన్ల పోలీసులు, డీఎంహెచ్‌ఓ బృందాలతో కలిసి మేడ్చెల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 10 నకిలీ క్లినిక్‌లపై దాడులు నిర్వహించి, వైద్యులుగా చలామణి అవుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రకారం.. పట్టుబడిన వ్యక్తులు ఎలాంటి చెల్లుబాటు అయ్యే వైద్య అర్హతలు లేకుండానే రోగులకు చికిత్స అందిస్తున్నట్లు గుర్తించారు. పిల్లలకు కూడా వైద్యం చేయడంతో పాటు, కొన్ని చోట్ల రోగులను బెడ్‌లపై అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా రోగులకు ఐవీ ఫ్లూయిడ్స్, సెలైన్ ఎక్కిస్తున్నట్లు దాడుల సమయంలో బయటపడింది. అర్హతలు లేని వ్యక్తులు ఇలాంటి వైద్య సేవలు అందించడం ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని పోలీసులు తెలిపారు.

**– వైద్య పరికరాలు, మందులు స్వాధీనం**
దాడుల్లో నకిలీ క్లినిక్‌ల నుంచి వైద్య సేవలకు ఉపయోగిస్తున్న పలు పరికరాలు, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో స్టెతస్కోప్‌లు, బీపీ యంత్రాలు, థర్మామీటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, బరువు కొలిచే యంత్రాలు, షుగర్ పరీక్షించే యంత్రాలు, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, సిరంజీలు, కాలం చెల్లిన మందులు, సెలైన్ బాటిళ్లు, సెలైన్ స్టాండ్‌లు ఉన్నాయి.

**– ఎనిమిది పోలీస్ స్టేషన్లలో కేసులు**
ఈ దాడులకు సంబంధించి మొత్తం ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు. మెద్చల్‌లో 2, పటాన్‌చెరులో 2, పెట్ బషీరాబాద్‌లో 1, జగద్గిరిగుట్టలో 1, సూరారంలో 1, బాచుపల్లిలో 1, ఆర్‌సీ పురంలో 1, ఐడీఏ బొల్లారంలో 1 కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎస్ఓటీ డీసీపీ పి. శోభన్ కుమార్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సమన్వయంతో దాడులు నిర్వహించి నకిలీ వైద్యులను పట్టుకున్న అధికారులను సీపీ అభినందించారు.
ఈ ఆపరేషన్‌లో ఎస్ఓటీ–1 అదనపు డీసీపీ టి. గోవర్ధన్, ఎస్ఓటీ–2 అదనపు డీసీపీ ఏ. విశ్వ ప్రసాద్, ఆర్‌సీ పురం ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ పి. సతీష్, కుత్బుల్లాపూర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కె. నరసింహతో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఓటీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ ఈ వివరాలను వెల్లడించారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# 'తుమ్మిడిహెట్టి' నిర్మాణానికి సహకరించండి - మహారాష్ట్రను కోరిన తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్ :** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సహ కరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరి ంది. 152 మీటర్ల ఎత్తుతో ఆన కట్ట నిర్మాణం వల్ల ముంపు పెద్దగా పెరిగేది ఉం డదని తెలివి ంది. దీని ద్వారా గ్రావిటీ ద్వారా కరవు పీడిత ప్రాంతానికి నీళ్లు వస్తాయని వివరించింది. అయితే ముంపుపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని మహారాష్ట్ర కోరడంతో 15 రోజుల తర్వాత భేటీ నిర్వహించాలని సీడబ్ల్యూసీ నిర్ణ యించింది. 2 రాష్ట్రాల భేటీని నిర్వహించిన సీడబ్ల్యూసీ : ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై దిల్లీలో కేంద్ర జలసం ఘం ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు సమావేశమ య్యారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చొరవ చూపాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాయడంతో రెండు రాష్ట్రాల భేటీని సీడబ్ల్యూసీ నిర్వహించింది. ఈ సమావేశంలో అధికారులు పలు అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర సహకారాన్ని కోరిన తెలంగాణ : ప్రాణహిత నదిపై 152 మీటర్ల వద్ద తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించుకునేందుకు సహకరించాలంటూ మహారాష్ట్రను రాష్ట్రం కోరింది. గ్రావిటీ ద్వారా కరవు పీడిత ప్రాంతాలకు నీటిని తరలించుకునే వెసులుబాటు ఉంటుందని సూచించింది. గతంలో 148 మీటర్ల వద్ద చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఈ రెండు స్థాయులోన్లూ ముంపు ప్రాంతంలో పెద్దగా వ్యత్యాసం లేదని ఆ రాష్ట్రానికి విన్నవించింది. ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకానికి నీటిని తీసుకునే ప్రాంతం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం, ఎత్తు, ముంపు అంశాలపై తెలంగాణ ప్రజెంటేషన్ ద్వారా వివరించింది. బీఆర్?ఎస్ ప్రభుత్వ హయాంలో 148 మీటర్ల వద్ద చేసుకున్న ఒప్పందానికి 152 మీటర్ల వద్ద చేపట్టినా వెనుక జలాల ప్రభావంలో పెద్దగా మార్పు ఉండదని రాష్ట్ర అధికారులు తెలిపారు. 15 రోజుల అనంతరం మరోసారి సమావేశం : 2,500 ఎకరాల వరకు ముంపు ఉన్నా చాప్రాల అభయారణ్యానికి ముప్పేమీ లేదని అధికారులు వివరించారు. పుణెలోని సెంట్రల్ వాటర్, పవర్ రీసెర్చ్ స్టేషన్, ఆర్వీ అసోసియేట్స్ చేపట్టిన సర్వే, అధ్యయనాలు ఈ విషయాలను చాటుతున్నాయని తెలంగాణ పేర్కొంది. దీనిపై రాష్ట్రంలో నెలకొనే ముంపుపై నివేదికల వివరాలు అందజేయాలని కోరారు. ముంపు స్థాయి వివరాలు, సీడబ్ల్యూసీ నివేదికలివ్వాలన్నా రు. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి దానిపై చర్చించాల్సి ఉంటుందన్నారు. 15 రోజుల్లో నివేదికలన్నీ అందజేస్తామని తెలంగాణ జవాబిచ్చింది. దీంతో పక్షం రోజుల అనంతరం మరోమారు సమావేశం నిర్వహిస్తామని సీడబ్ల్యూసీ రెండు రాష్ట్రాలకు తెలియజేసింది.

## ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే చర్చకు రండి.. కేటీఆర్, హరీశ్‌కు మంత్రి అడ్లూరి సవాల్



**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు సంబంధించి బీఆర్‌ఎస్ ఛార్జ్‌షీట్‌పై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. (బుధవారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి లిస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుకు వాట్సాప్‌లో పంపిస్తున్నట్లు చెప్పారు. ఛార్జ్‌షీట్ కాదు దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ ఛార్జ్‌షీట్‌లో అబద్ధాలు మాత్రమే ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను హరీశ్ రావు, కేటీఆర్, కేసీఆర్‌కు రిపోర్ట్ పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను అమలు చేస్తూనే కొత్త పథకాలు కూడా ఇస్తున్నామని చెప్పారు. 'మాకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. అప్పుడే కేటీఆర్‌కు తొందర ఎందుకు' అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ 2014-18 మ్యానిఫెస్టో, కాంగ్రెస్ 2023 మ్యానిఫెస్టోపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. 'మీ పదేళ్ల పాలన, మా రెండున్నరేళ్ల పాలనపై దమ్ముంటే చర్చకు రండి' అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ చేశారు.

## కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించను



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంతకాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని రాజగోపాల్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్దఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గో పాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం' అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# భూ భారతి రిజిస్ట్రేషన్లకు మోక్షం ఎన్నడు?




**హనుమకొండ:** స్లాట్ బుక్ చేసుకున్నాం.. సర్కారుకు చెల్లించాల్సిన చలాన్ల డబ్బులు ముందే కట్టాం.. అయినా రోజుల తరబడి తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాలా? అని రైతులు, భూ కొనుగోలుదారు లు అధికారులను నిలదీస్తున్నారు. హనుమ కొండ జిల్లాలోని ఆరు మండలాల్లో వేలేరు, పరకాల, కమలాపూర్, దామెర, ఐనవోలు, కాజీపేటలో భూ భారతి రిజిస్ట్రేషన్ల నిలిపివేత వెనుక కలెక్టరేట్ డి-సెక్షన్ సూపరింటెండెంట్ నాగరాజు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమన్న ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లిన వారు పనులను వదులుకొని వారం రోజులుగా రిజిస్ట్రేషన్ కోసం జిల్లాలో ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 25 నుంచి 31 తేదీ సోమవారం వరకు పూర్తిగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమి అలసత్వం? పాత ఆపరేటర్లను విధుల నుంచి తొలగించిన అధికారులు, పోర్టల్‌లో వారి లాగిన్ ఐడీలను డిసేబుల్ చేయడంలో ఎందుకు ఆసల్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త సిబ్బందికి ప్రత్యేక లాగిన్ ఐడీలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకని మండిపడుతున్నారు. పర్యవేక్షణ లోపంతో సాంకేతిక చిక్కులు తలెత్తుతుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల మార్పిడి, కుటుంబ హక్కుల బదిలీ, వారసత్వ నమోదు, గిఫ్ట్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్స్ వంటి అత్యవసర రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో వందలాది మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసుల చుట్టూ తిరిగే రైతుల ఆవేదన అధికారులకు పట్టడం లేదా.. అని ప్రశ్నిస్తున్నారు. భూ భారతి ఆపరేటర్ల కొనసాగింపులో సీనియారిటీ ప్రకారం మొదటి ఏడుగురు ఆపరేటర్లే విధులు నిర్వహి ంచాల్సి ఉందని డి-సెక్షన్ సూపరింటెండెంట్ నాగరాజు స్పష్టం చేశారు. అయితే ఆచరణలోకి వచ్చేసరికి సీనియారిటీ నిబంధనలను విస్మరించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీనియారిటీ జాబితాలో 11వ స్థానంలో ఉన్న ఒక ఆపరేటర్‌ను నిబంధనలకు విరుద్ధంగా 7వ స్థానంలోకి చేర్చి విధుల్లోకి తీసుకున్నట్లు పలువురు ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. 11వ స్థానంలో ఉన్న వ్యక్తికి లబ్ధి చేకూర్చే క్రమంలో అతడి కంటే సీనియర్ అయిన వేలేరు తహసీల్దార్ కార్యాలయం భూ భారతి ఆపరేటర్‌ను అన్యాయంగా తొలగించే కుట్ర చేశారని ఆరోపిస్తున్నారు. సీనియారిటీ ఉన్న ఆపరేటర్‌ను పక్కనబెట్టి, వెనుక ఉన్న వ్యక్తిని ముందుకు తీసుకురావడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. అడ్మినిస్ట్రేటివ్ పొరపాట్లు, అధికారుల సమన్వయ లోపంతో నెలకొన్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

# హిట్ అండ్ రన్ కేసు - ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి కుమారుడు సందీప్ అరెస్ట్



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఖాజాగూడలో కార్లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనలో ప్రమాదానికి కారణమైన నిందితుడిని రాయదుర్గం పోలీసులు గుర్తించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌ను అరెస్టు చేశారు. మృతి చెందిన వ్యక్తిని సైతం గుర్తించారు. రాయదుర్గం సీఐ భూపతి తెలిపిన కథనం ప్రకారం, మృతుడు బిహార్‌కు చెందిన నందకిశోర్(31) అని గుర్తించారు. నందకిశోర్ రాయదుర్గంలోని ఓ హోటల్‌లో కిచెన్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన స్నేహితుడిని కలిసి, తెల్లవారుజామున రోడ్డుపై నడిచి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. దీంతో జైద్ షా అనే ఓ డ్రైవర్, మరో వ్యక్తి అతడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రెండు కార్లు వేగంగా వచ్చి ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాయి. దీంతో నందకిశోర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సీసీ కెమెరాలు జల్లెడ పట్టి : స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఖాజాగూడ నుంచి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ఉన్న పలు సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టారు. సందీప్ నడుపుతున్న కారు ఢీకొనడంతోనే నందకిశోర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. మరో కారు నడిపిన శౌర్య అనే యువకుడిని కూడా అదుపు లోకి తీసుకున్నారు. వీరిద్దరూ స్నేహితు లు కావడం గమనార్హం. వెంటాడిన మృత్యువు : నందకిశోర్‌ను మృత్యువు వెంటాడింది. ఒక ప్రమాదంలో గాయాలతో బయటపడగా, అంతలోనే మరో రెండు కార్లు వరుసగా ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఖాజాగూడ తౌటోనికుంట వద్ద సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో నందకిశోర్ (31) రోడ్డు దాటుతున్నాడు. నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ వైపు నుంచి ఖాజాగూడ వైపు వెళ్తున్న ఇన్నోవా క్రిస్టా వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు స్వల్పంగా గాయపడ్డాడు. వెంటనే ఇన్నోవా డ్రైవర్ జైద్ షా కద్రి (21), అటుగా వెళ్తున్న మరో క్యాబ్ డ్రైవర్ కలిసి నందకిశోర్?ను పైకి లేపి ట్రీట్?మెంట్ కోసం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. నడిచే స్థితిలో ఉన్న అతడిని పట్టుకుని రోడ్డు దాటించేందుకు వెళుతున్న సమయంలో ఖాజాగూడ వైపు నుంచి నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ వైపు వేగంగా వెళ్తున్న రెండు కార్లు వారిని ఒకదాని తర్వాత మరోటి బలంగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో క్షతగాత్రుడు (నందకిశోర్) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన రెండు కార్లు ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు సీసీ కెమెరాలను జల్లెడ పట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

## భోధన్ నుంచి కవిత పోటీ చేయాలనుకుంటే స్వాగతిస్తానన్న షకీల్ అహ్మద్



**నిజామాబాద్ జిల్లా :** రాజకీయాల్లో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత బోధన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తే ఆమెను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ ఘన స్వాగతం పలుకుతానని ఆయన స్పష్టం చేశారు. కవిత భర్త అనిల్ స్వగ్రామం 'పొత్తంగల్' బోధన్ నియోజకవర్గం పరిధిలోనే ఉందని, ఆ రకంగా బోధన్ నియోజకవర్గానికి ఆమె సొంత అత్తగారి ఊరు, కోడలిగా పోటీ చేయడానికి పూర్తి హక్కు, అర్హత ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల కవిత బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకున్న ఘటనపై షకీల్ స్పందిస్తూ... ఆ దృశ్యం చూసి తనకు తీవ్ర బాధ కలిగిందని, అది ఆమె వ్యక్తిగత వేదన కావచ్చునని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కవిత కుటుంబంలో అంతర్గతంగా ఏం జరిగిందనే దానిపై తనకు ఎలాంటి సమాచారం లేదని వ్యాఖ్యానించారుసొంత నియోజకవర్గాన్ని వేరొకరికి ఆఫర్ చేస్తూ షకీల్ చేసిన ఈ ప్రకటనతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చ మొదలైంది. ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కొత్త రాజకీయ దారి వెతుక్కుంటారా లేక పార్టీ మారనున్నారా అనే ఊహాగానాలు నిజామాబాద్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## స్మార్ట్ రేషన్ కార్డుల కోసం జనం పరేషాన్




**కరీంనగర్ టౌన్:** స్మార్ట్ రేషన్‌కార్డుల్లోని తప్పులను చూసి జనం తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో 3,21,740 మందికి స్మార్ట్‌రేషన్‌కార్డులను పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతోంది. మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కార్డుల పంపిణీ ప్రక్రియ చిన్నచిన్న ఇబ్బందులతో సాగుతుంటే, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. నగరంలోని 66 డివిజన్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగంలోని జవాన్లకు అప్పగించి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకున్నారు. పాత రేషన్‌కార్డుల మాదిరిగా కుటుంబ యజమానురాలి పేరుతోపాటు ఇంటి నంబరు, కాలనీ పేరు, షాపు నెంబరుతో కార్డులు తయారుచేస్తే బాగుండేదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు. ఈసారి మూడు నెలల కోటా బియ్యం మొత్తం పంపిణీ చేశారని, మూడు నెలల తర్వాత కొత్త కార్డు ఉంటేనే బియ్యం ఇస్తారా లేదా, ఒక వేళ కార్డు ఇవ్వకుంటే తమ పరిస్థితి ఏమిటని లబ్దిదారులు ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటి వరకు నగరంలోని కొన్ని డివిజన్లలోనే స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ జరుగుతోంది. కొన్ని చోట్ల అసలు ఎప్పుడు, ఎవరు, ఎక్కడ పంపిణీ చేస్తారో, వార్డు కార్యాలయాల్లో ఇస్తారో, ఇంటింటికి తెచ్చి ఇస్తారో తెలియక ప్రజలు అయోమ యానికి గురవుతున్నారు. కొందరు కార్పొ రేటర్లు వారి సమీప డివిజన్లలోని జవాన్లందరిని పిలి పించి దుకాణాల వారీగా విభజించి పంపిణీ చేస్తు న్నారు. కొన్ని చోట్ల అసలు కార్పొరేటర్లు పట్టించు కోకుండా జవాన్ల వద్దకు వెళ్లాలని చెబు తుండడంతో రేషన్‌కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది.

# వ్యవస్థలన్నింటినీ రేవంత్ రెడ్డి కుప్పకూల్చారు



కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని ఇస్తే.. రేవంత్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చారని విమర్శించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి మాజీ మంత్రి, శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్ ఎంతో కష్టపడి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా కుప్పకూలుస్తోందని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాటాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆధ్వర్యంలో ఈరోజు కాంగ్రెస్ వైఫల్యాలపై 'ఛార్జ్ షీట్' విడుదల చేశామని తెలిపారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అరాచకాలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ ఘోర వైఫల్యాలను ఎండగడుతూ ఈ ఛార్జ్ షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో బాండు పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మబలికిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఒక కొత్త రాష్ట్రాన్ని తన అపార అనుభవంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతో కష్టపడి అద్భుతంగా నిర్మించారని తెలిపారు. అనేక కార్యక్రమాలతో దేశం నేర్చుకునే విధంగా తొమ్మిదిన్నర ఏళ్లు గొప్ప పాలనను అందించారన్నారు. అది తాగునీటి రంగం కావచ్చు, సాగునీటి రంగం కావచ్చు.. ఏ రంగం చూసినా తెలంగాణను దేశానికే ఆదర్శంగా, తలమానికంగా కేసీఆర్ తయారు చేశారని అన్నారు. వ్యవసాయంలో అత్యధిక వరి ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రగామిగా నిలిపారని కొనియాడారు. కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అద్భుతమైన వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా కుప్పకూలిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. విద్యా వ్యవస్థ, వైద్య వ్యవస్థ, విద్యుత్, తాగునీరు, శాంతిభద్రతలు.. ఇలా ప్రతీ వ్యవస్థా కుప్పకూలిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఉంటే.. ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో కరెంట్ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దయనీయ పరిస్థితి చూస్తున్నామని అన్నారు. దేశంలోనే అగ్రగామిగా నిలిచిన వైద్య రంగం.. నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మందులు కూడా దొరకని దీన స్థితికి దిగజారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాగా రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పజెబితే.. దాన్ని మరింత అద్భుతంగా ముందుకు తీసుకెళ్లాల్సింది పోయి, పూర్తిగా నాశనం చేసి కుప్పకూల్చారని అన్నారు. పురోగమనం వైపు వేగంగా ప్రయాణం చేయాల్సిన రాష్ట్రం.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో తిరోగమనం వైపు పయనిస్తోందని అన్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# పవర్ స్టార్ నుంచి పవర్‌లోకి- రాజకీయాలతో పాటు సినిమాలు! పవన్ కల్యాణ్ ప్రయాణం సాగిందిలా

**అమరావతి:** పవన్ కళ్యాణ్ సెప్టెంబర్ 2తో 55వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. 1996లో హీరోగా మొదలైన జర్నీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం బాధ్యతల వరకు వచ్చింది. మధ్యలో సినిమాల్లో భారీ విజయాలు దక్కాయి. ఇక కొన్ని సంవత్సరాలు సరైన ఫలితం కోసం కూడా ఎదురుచూడాల్సి వచ్చింది. రాజకీయా ల్లోనూ మొదటి ఎన్నికలు ఓటమిని చూపిం చాయి. అయినా రెండు రంగాల్లోనూ నమ్మకం తోనే కొనసాగారు. ప్రస్తుతం ప్రభుత్వ బాధ్య తల్లో కొనసాగుతూనే సినిమాలు కూడా చేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ పుట్టినరోజు సంద ర్భంగా దేశంలోని ప్రముఖ రాజకీయ నాయ కులు, సినీ తారలు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.తొలిప్రేమతో మారిన లెక్కఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'తో పవన్ కళ్యాణ్ హీరోగా పరిచయమయ్యారు. ఆ తర్వాత గోకులంలో సీత, సుస్వాగతం సినిమాలతో వరుసగా ప్రేక్షకుల ముందుకొచ్చారు. 1998లో వచ్చిన తొలిప్రేమ కెరీర్‌లో పెద్ద యూ టర్న్ తీసుకొచ్చింది. కరుణాకరన్ దర్శకత్వంలో



తెరకెక్కిన ఈ సినిమా ఆ ఏడాది ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డు అందుకుంది. నంది అవార్డుల్లో కూడా ఉత్తమ చిత్రంగా నిలవడంతో పాటు మొత్తం ఆరు అవార్డులు దక్కాయి. ఆ ప్రేమకథలో పవన్ పాత్ర, కామెడీ టైమింగ్, యూత్‌కు దగ్గరగా ఉన్న క్యారెక్టర్ బాగా క్లిక్ అయ్యింది. అదే ఒక ఫాలోయింగ్ తీసుకొచ్చిం ది. చిరంజీవి తమ్ముడిగా ఇండస్ట్రీలోకి వచ్చిన పవన్‌కు మొదట తనకంటూ వేరే గుర్తింపు ఇచ్చింది మాత్రం 'తొలిప్రేమ' సినిమానే. తమ్ముడు నుంచి ఖుషి వరకు1999లో తమ్ముడు, 2000లో బద్రి, 2001లో ఖుషి వరుసగా రిలీజ్ అయ్యాయి. మూడు సినిమాల్లోనూ పవన్ పాత్ర, సినిమా ట్రీట్‌మెంట్ ఒకేలా ఉండదు. 'తమ్ముడు'లో మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం, బద్రిలో పూరి జగన్నాథ్ స్టైల్ హీరో క్యారెక్టర్, ఖుషిలో ప్రేమకథతో పాటు వచ్చిన కామెడీ యూత్‌కు మరింత దగ్గర చేశాయి. పవన్ హెయిర్ స్టైల్, డ్రెస్సింగ్, మాట్లాడే విధానం, కొన్ని మేనరిజమ్స్‌ను అప్పటి యువత ఫాలో అయ్యేది. ముఖ్యంగా 'ఖుషి' తర్వాత పవన్ టాప్ హీరోల్లో ఒకరిగా మారారు. అభిమానులు 'పవర్ స్టార్' అని పిలవడం కూడా ఈ దశలో మరింత పెరిగింది. యాక్షన్ సీన్స్‌లో తనకు తెలిసిన మార్షల్ ఆర్ట్స్‌ను ఉపయోగించడం, హీరో క్యారెక్టర్‌లో తనదైన మేనరిజమ్స్ పెట్టడం అప్పటి పవన్ సినిమాల్లో ఎక్కువగా కనిపించేది. ముఖ్యంగా తమ్ముడు సినిమాలో చేతుల మీద నుంచి కార్లను పోనివ్వడం రియల్ స్టంట్. జనసేన 137 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి ఒక్క సీటు మాత్రమే గెలిచింది. 18 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసినా ఒక్కటి కూడా దక్కలేదు. ఆ ఫలితం తర్వాత కూడా పార్టీని కొనసాగించిన పవన్ రైతుల సమస్యలు, రోడ్లు, ప్రభుత్వ విధానాలపై కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. 2024 ఎన్నికలకు వచ్చేసరికి మాత్రం ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తీసుకుంది.21కి 21- పిఠాపురం ఎమ్మెల్యే నుంచి డిప్యూటీ సీఎం 2024 ఎన్నికల్లో జనసేన టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేసింది. ఆ పార్టీకి 21 అసెంబ్లీ స్థానాలు కేటాయించగా అన్ని 21 చోట్లా గెలిచింది. పోటీ చేసిన రెండు లోక్‌సభ స్థానాలు కూడా జనసేన ఖాతాలోకే వెళ్లాయి. దీంతో 21 మంది ఎమ్మెల్యేలతో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. పవన్ పిఠాపురం నుంచి వేలకుపైగా మెజారిటీతో గెలిచారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఆయనకు కేటాయించారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు.. బీజేపీ అధిష్ఠానం కీలక బాధ్యతలు

**అమరావతి, సెప్టెంబర్ 2:** వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా మంత్రి సత్యకుమార్‌ను నియమిం చింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు బీజేపీ, ఎన్డీయే ప్రభు త్వాల ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రజాసే వ, దేశాభివృద్ధి, 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ఈ అభియాన్‌లో పలు కార్యక్రమాలను రూపొందించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాల సమన్వయం, అమలు, పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి సత్యకుమార్ నిర్వహించనున్నారు. అభియాన్‌లో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి పలు సేవా.. ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు



ప్రణాళిక రూపొందించారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా అభియాన్ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరుచిరాపల్లిలో మరికా సేపట్లో జరగనున్న రాష్ట్రవ్యాప్త కార్యశాలలో మంత్రి సత్యకుమార్ పాల్గొననున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కార్యక్రమాలపై ఈ కార్యశాలలో చర్చించి.. అభియాన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమై న కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

# బీసీ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

**విజయవాడ, సెప్టెంబర్ 2 :** బీసీ హాస్టళ్లు, గుర ుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యా ర్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నా మని ఏపీ మంత్రి సవిత ( వ్యాఖ్యానిం చారు. ఆయా హాస్టళ్లు, గురుకులాలు, వాటి పరిసరా ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నా రు. విజయవాడలోని గుణదల బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో శానిటరీ కిట్లను మంత్రి సవిత (బుధవారం) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లిఖార్జున, ఇతర బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మంత్రి సవిత మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినుల వినతి మేరకు గుణదల హాస్టల్‌లో గ్రంథాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు.బీసీ హాస్టళ్లలో 1,200 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించామని మంత్రి సవిత వెల్లడించారు. ఏపీవ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లకు రూ.6 కోట్ల విలువైన శానిటరీ కిట్లు అందజేస్తున్నామని చెప్పుకొచ్చార. ఒక్కో కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయని వివరిం చారు. ఇప్పటికే



బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో దోమ తెరలు ఏర్పాటు చేశామని అన్నారు. ఆర్వో ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు.బీసీ విద్యార్థుల రక్షణకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. మెనూ సక్రమంగా అమలు చేసేలా 142 మంది కుక్ లు, కమాటీలను నియమించామని తెలిపారు. ఇంటిని మైమరి పించేలా హాస్టళ్లు, గురుకులాల్లో వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. వచ్చే పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ఈ ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని అన్నారు. బీసీ బిడ్డలకు విద్యా, వసతి మంత్రి సవిత పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికలపై 'సర్' ప్రభావం చూపదు

**అమరావతి:** ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈసీ నిర్వహించే సర్ ప్రక్రియ రాష్ట్రంలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు.ఈసీ చేపట్టిన సర్ ప్రక్రియ ముగిసి, తుది ఓటర్ల జాబితాను ప్రచురించాకే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. 'సర్' ప్రక్రియ ముగిసే వరకు స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలన్న వైఎస్సార్సీపీ కోరిక సరికాదని ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డుల వారీ ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రచురించారని, పోలింగ్ స్టేషన్లను నోటిఫై చేసే ప్రక్రియ పూర్తయ్యిందని, అలాగే ఓటర్ల జాబితా సవరణ అనేది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఎన్నికలు జరపాలని దాఖలైన మరో పిల్ ధర్మాసనం వద్ద విచారణలో ఉన్నందున, ఈ పిటిషన్‌ను కూడా అక్కడికే పంపాలని ఏజీ కోరగా అందుకు అంగీకరించిన న్యాయమూర్తి ఈ పిటిషన్‌ను ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.జాబితా సవరణ నిరంతర ప్రక్రియ: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు, రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేదని, ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు అనేది నిరంతర ప్రక్రియ అని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలిపారు.సిద్ధంగా ఉన్న జాబితాలు: గ్రామ పంచాయతీల వార్డుల వారీ ఓటర్ల జాబితాను ఇప్పటికే



ప్రచురించారని, పోలింగ్ స్టేషన్ల నోటిఫికేషన్ కూడా పూర్తయిందని ఏజీ పేర్కొన్నారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల వార్డుల వారీ జాబితా ఈ నెల 3న ప్రచురితమయ్యే అవకాశం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణలను సాకుగా చూపి ఎన్నికలను వాయిదా వేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, నోటిఫికేషన్ సమయానికి అందుబాటులో ఉన్న ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహిం చవచ్చని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ వేసే చివరి తేదీ వరకు ఓటర్ల జాబితాలో మార్పులకు వెసులుబాటు ఉంటుం దన్నారు.ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్‌లో: అక్టోబర్ మొదటి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉందని ఏజీ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలను తక్షణమే నిర్వహించాలంటూ దాఖలైన పిల్ ఈ నెల 9న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు రాను న్న నేపథ్యంలో, వైఎస్సార్సీపీ దాఖలు చేసిన తాజా వ్యాజ్యాన్ని కూడా అదే ధర్మాసనానికి బదిలీ చేయాలని న్యాయ మూర్తి జస్టిస్ వి.సుజాత రిజిస్ట్రీని ఆదేశించారు.వైఎస్సా ర్సీపీ పిటిషన్, అభ్యర్థన: కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసి, తుది జాబితా వచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఈసీ ఈ ఏడాది జులై 1ని అర్హత తేదీగా తీసుకుని ఓటర్ల సవరణ చేపడుతుంటే, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా 2026 జనవరి 1ని అర్హత తేదీగా తీసుకుని ఎన్నికలకు వెళ్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ కోర్టుకు వివరించారు.నకిలీ ఓట్ల తొలగింపు ప్రస్తావన: 'సర్' ప్రక్రియలో భాగంగా ముసాయిదా జాబితా నుంచి లక్షల సంఖ్యలో మరణించిన, నకిలీ, వలస వెళ్లిన వారి పేర్లను తొలగించారని, అక్టోబర్ 3 నాటికి ఈ ప్రక్రియ ముగిసి తుది ఓటర్ల జాబితా వస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్: ఎస్ఈసీ మాత్రం సెప్టెంబర్ 3 లోగా వార్డుల వారీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని నోటిఫికేషన్ ఇచ్చిందని, కాబట్టి ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే నామినేషన్ల ప్రక్రియ ముగింపు తేదీ నాటి వరకైనా ఓటర్ల సవరణలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశించాలని కోరారు.

# ఇక ఉత్తరాంధ్రకు సాగునీటి కష్టాలు దూరం.. రైతుల కలను నిజం చేస్తున్నాం


**అమరావతి:**ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తున్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ ప్రభు త్వం రెక్కలు తొడుగుతోందని, ఇందులో భాగంగానే పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఇప్పుడు గోదావరి జలాలను అందిస్తున్నామని తెలిపారు.పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల ఉత్తరా ంధ్ర రైతుల అభివృద్ధికి ఆరంభమని లోకేశ్ అభివర్ణించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలను మళ్లించి ఈ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు అందిస్తున్నామని వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రతో పాటు తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల రైతులకు



కూడా ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. మొత్తం 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుందని పేర్కొన్నారు. పోలవరం కుడి కాలువ ద్వారా ఇప్పటికే రైతులు సుమారు 500 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారని, అదే తరహాలో ఎడమ కాలువ ద్వారా కూడా ఉత్తరాంధ్ర రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి పోలవ రం ఎడమ కాలువను అనుసంధానించే ప్రక్రియకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని లోకేశ్ వెల్లడించారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తీసుకురావడంతో పాటు, పాడిపంటలకు అవస రమైన సాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. సమగ్రాభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధి అనే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.

# రైతులను అడ్డం పెట్టుకుని డ్రామాలు ఆడొద్దు

**శ్రీశైలం, సెప్టెంబర్ 2:** శ్రీశైలం జలాల కోసం వెలుగోడు రిజర్వాయర్ ముట్టడి పేరుతో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఆయన కొడుకు రవి కిషోర్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఎల్ నినో ప్రభావం వల్ల నీరు వచ్చే పరిస్థితి లేదని, అందువల్ల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆరు నెలల క్రితమే స్పష్టం చేశామని ఆయన పేర్కొన్నారు. కానీ వైసీపీ నాయకులు రైతులను అడ్డం పెట్టుకుని



శ్రీశైలం జలాల కోసం పోరాటాలు చేయడం రైతులను తప్పుదోవ పట్టించడమే అవుతుందని ఆయన అన్నారు. తమ ఉనికిని కాపాడుకోవడం కోసం రైతులను అడ్డుపెట్టుకుని డ్రామాలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు.రైతుల పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లయితే వైసీపీ హయాంలో రైతుల సంక్షేమం కోసం ఏం చేశారో చెప్పాలని రాజశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నిసార్లు రైతులకు నీళ్లు ఇచ్చారో చెప్పాలని ఆయన నిలదీశారు. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో కర్నూలులో నీటి సమస్యలను పరిష్కరించాలని అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దగ్గరికి వెళ్తే మీరేం చేశారు.. పోలీసులతో రైతులను అడ్డగించలేదా..? ఆనాడు ఏం అయింది మీ చిత్తశుద్ధి?' అని ఎమ్మెల్యే నిలదీశారు.

# స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోంది

**కర్నూలు, సెప్టెంబర్ 2 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం గొడ్డలి పార్టీ ఆరాట పడుతోందని విమర్శించారు. వైసీపీ ఏ రోజు ప్రజల సమస్యలపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. ఈరోజు (బుధవారం) కర్నూలు జిల్లాల్లో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పర్యటించి,



పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనతో ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారని పేర్కొన్నారు.జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రజా సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పే దమ్ము ఉందా అని బీసీ జనార్ధన్ రెడ్డి నిలదీశారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో పట్టిసీమను పూర్తి చేసి ఆదుకున్నారని తెలిపారు. పులివెందులకు కూడా నీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదని చెప్పుకొచ్చారు. 36 నీటి ప్రాధాన్య ప్రాజెక్టులకు నీరు ఇస్తున్నామని వెల్లడించారు. ఏపీలో డ్రిప్ ఇరిగేషన్ లేకుండా చేసింది జగన్ మోహన్ రెడ్డినే అని విమర్శించారు.వైసీపీ నేతలు దొంగ దీక్షలు, ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు. ప్రజలకు, రైతులకు ఏ విధంగా నీరు ఇవ్వాలో అధికారులతో తాము సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. తలకిందులు చేసిన కూడా గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి పండుగ.. చంద్రబాబు అపర భగీరథుడు

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసం ధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని ఏపీ స్వచ్ఛా ంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావర ణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశా ్యమలం కాబోతో ందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌ల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా



ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమ తులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ.1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు కడుపుమంటతో అల్లాడిపోతున్నారని అన్నారు.